సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



మన్యంలో భారీ వర్షం 8లో

మన్యంలో సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



నిఘా కట్టుదిట్టం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద భద్రత, నిఘాను పోలీసు యంత్రాంగం మరింత కట్టుదిట్టం చేసింది. 8లో



వైభవంగా తిరువీధి

సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. 8లో

టెన్త్ ఉత్తీర్ణతలో పైపైకి

- రాష్ట్రస్థాయిలో 9వ స్థానం
- 90.95 శాతం మేర ఫలితాలు
- ప్రతిభ కనబరిచిన బాలికలు





టెన్త్ సూపర్ ఫిఫ్టీ విద్యార్థులతో పీవో అభిషేక్ (ఫైల్) విద్యార్థిని ధారమణి

సాక్షి,పాడేరు: ఈ ఏడాది టెన్త్ ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో జిల్లా నిలిచింది. గత విద్యా సంవత్సరంలో 61.41శాతం కాగా, ఈసారి 90.95 శాతం మేర ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో 22 మండలాల పరిధిలో 10,961మంది విద్యార్థులు హాల్ టికెట్లు పొందారు.వీరిలో 138 మంది మినహా మిగిలిన 10,823 మంది పరీక్ష రాశారు. వీరిలో 9,843మంది ఉత్తీర్ణులు కాగా 979 మంది పరీక్ష తప్పారు.

బాలికలదే పైచేయి

టెన్త్ ఉత్తీర్ణతలో బాలికలది పైచేయిగా నిలిచింది. బాలురు 4,401 మంది, బాలికలు 5,442 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో 6,243 మంది విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులై 57శాతం సాధించారు. రెండవ స్థానంలో 2423 మంది, మూడవ స్థానంలో 1170 మంది, ఏడుగురు చివరిస్థానంలో నిలిచారు. గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీ, ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మంచి ఫలితాలు రావడంతో కలెక్టర్ విజయసునీత, ఐటీడీఏ పీవోలు, విద్యాశాఖ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

చింతూరు డివిజన్‌లో 90 శాతం.. పీవో చైతన్య

చింతూరు: టెన్త్ పరీక్ష ఫలితాల్లో చింతూరు డివిజన్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా 1,452 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,306 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వసుంధర 570 మార్కులతో డివిజన్ టాపర్‌గా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.7 వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ 6 వేలు, మూడవ స్థానం సాధించిన విద్యార్థికి రూ 5 వేలు పారితోషికం అందిస్తామని ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు.

పాఠశాలల వారీగా ఫలితాలు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ ఫలితాలు మెరుగుపడ్డాయి.జిల్లాలోని గిరిజన సంక్షేమ విద్యాలయాల్లో 8,132 మందికి 7,323 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీల్లో 668మందికి 602మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 1285 మందికి 1119 మంది,ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 440మందికి 371మంది పాసైనట్టు ఉన్నతాధికారవర్గాలు తెలిపాయి.

సూపర్ ఫిఫ్టీతో సత్ఫలితాలు

పాడేరు : పాడేరు ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు అందించిన సూపర్ ఫిఫ్టీ శిక్షణ మంచి ఫలితాలను ఇచ్చింది. ఐటీడీఏ పరిధిలోని 117 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులను ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేశారు. వీరిలో 30 మంది బాలికలు, 20 మంది బాలురు ఉన్నారు. వీరంతా శిక్షణను సద్వినియోగం చేసుకుని టెన్త్‌లో మంచి మార్కులు సాధించారు. గతంలో ఎన్నడు లేనంతగా వందల సంఖ్యలో గిరిజన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు.వీరిలో గూడెంకొత్తవీధి గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థిని కిల్లో ధారామణి 585 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో పసుకోని దీపిక 549, కె.ధనలక్ష్మి 547, కిల్లో దేవి 541, బాలురలో పెదబయలు మండలం సీకరి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన కిల్లో తిరుపతి 566 మార్కులు సాధించాడు. తాంగుల హరిబాబు ప్రసాద్ 562 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వారికి ఆయన అభినందనలు తెలిపారు.

పుట్టెడు దుఃఖంలోనూ..

- పరీక్ష రాస్తుండగా తండ్రి మరణవార్త
- ధైర్యం కోల్పోకుండా హాజరైన చరణ్‌తేజ
- ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత
- పలువురి అభినందన



చరణ్‌తేజ

రాజవొమ్మంగి: పరీక్ష రాస్తుండగా తండ్రి మరణవార్త విన్న ఆ విద్యార్థి ధైర్యం కోల్పోకుండా పది పరీక్షలు పూర్తి చేశాడు. నేడు 374 మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మండలంలోని తంటికొండకు చెందిన పరశిక చరణ్‌తేజ టెన్త్ సోషల్ పరీక్ష రాస్తుండగా తండ్రి మరణించిన వార్తను విన్నాడు. అయినా మనోనిబ్బరం కోల్పోకుండా, తన లక్ష్యాన్ని మరవకుండా దుఃఖాన్ని దిగమింగుకుని ఆ రోజు పరీక్ష పూర్తి చేసి ఇంటికి వెళ్లాడు. తండ్రి అంత్యక్రియల అనంతరం మిగతా పరీక్షలకు కూడా హాజరయ్యాడు. సోమవారం విడుదలైన పది పరీక్షల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు, అతనిని హెచ్ఎం గోపాలకృష్ణ, క్లాస్ టీచర్లు అభినందించారు. తాను బాగా చదువుకొని తల్లికి ఏ కష్టం రాకుండా చూసుకుంటానని చరణ్‌తేజ తెలిపాడు.

జనమే జనం.. పోటెత్తిన అభిమాన ప్రవాహం.. రోడ్లకిరువైపులా జనం బారులు.. మహిళల హారతులు.. పూలవర్షాలతో కనీవినీ ఎరుగని అఖండ స్వాగతం నడుమ మధ్య సాగిన సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ఉమ్మడి విశాఖ జిల్లాలో సూపర్ హిట్ అయింది. సార్వత్రిక ఎన్నికల ముంగిట్లో బస్సుయాత్ర వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. అడుగడుగునా అశేష జనవాహిని నడుమ సాగిన బస్సుయాత్ర ప్రతిపక్ష పార్టీల గుండెల్లో వణుకు పుట్టించింది. సంక్షేమ రథసారథి.. పేదల పెన్నిధి.. తమకు మంచి చేసిన జననేతను దగ్గరి నుంచి చూడాలని.. వీలైతే మాట్లాడాలని.. ఒక్క ఫొటో తీసుకోవాలని ప్రజలు ఉత్సాహం చూపించగా.. ఆయనే స్వయంగా బస్సు దిగి ఆప్యాయంగా పలకరించడం.. 'నేను ఉన్నానంటూ' భరోసా కల్పించడంతో శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో గెలుపుపై ధీమా పెరిగింది.

సూపర్‌హిట్



కశింకోట మండలం చింతలపాలెం బహిరంగ సభకు తరలివచ్చిన భారీ జన సందోహం



- ఉమ్మడి విశాఖలో సీఎం జగన్ బస్సుయాత్రతో వైఎస్సార్ సీపీలో జోష్
- మేమంతా సిద్ధం అంటూ నినదించిన ప్రజానీకం
- కార్యకర్తలు, నాయకుల్లో కొత్త ఉత్సాహం
- కార్యనిర్వాహక రాజధానికి ఓటేస్తామంటూ చాటిచెప్పిన జనం
- ప్రతి నియోజకవర్గంలోనూ స్వచ్ఛందంగా కదిలివచ్చిన ప్రజలు

సాక్షి, విశాఖపట్నం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి విశాఖలో అడుగుపెట్టింది మొదలు ప్రజలు అదే ప్రేమాభిమానాలు కురిపించారు. జై జగన్ అంటూ నినదించారు. పేదల ప్రతినిధికి జేజేలు పలికారు. ఆయన మాట ఇచ్చాడంటే తప్పడంతే అని నమ్మిన ప్రజలు స్వచ్ఛందంగా జగనన్న చూసేందుకు తరలివచ్చారు. జగనన్న మాటకు.. బాటకు ప్రజలు విలువ ఇస్తున్నారు. ఆయన ఒక్క అడుగు వేస్తే.. లక్షలాది పాదాలు ఆయనను అనుసరించాయి. అందుకే మేమంతా సిద్ధం బస్సుయాత్ర జనజాతర తలపించింది. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది.

అక్కున చేర్చుకున్న జనం

×ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించి.. ఇక్కడే ప్రమాణస్వీకారం చేస్తా. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చేస్తూ.. ఇక్కడి నుంచే పరిపాలన సాగిస్తానంటూ ఇటీవల జరిగిన విజన్ విశాఖ సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు.. అందుకే అన్నొస్తేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమని విశాఖ జనం విశ్వసించారు×.. మేము సిద్ధం యాత్రలో భాగంగా జనంతో మమేకమయ్యేందుకు విశాఖ చేరుకున్న వైఎస్ జగన్‌కు విశేష ఆదరణ లభించింది. 2019 ప్రజాసంకల్ప యాత్రలో ఎలాగైతే జనం అక్కున చేర్చుకున్నారో అంతకు మించిన అభిమానాన్ని ఉమ్మడి విశాఖ ప్రజలు మేమంతా సిద్ధం అంటూ చూపిస్తున్నారు.

సభలో స్పందన భేష్

బస్సుయాత్రలో భాగంగా ఈ నెల 20న అనకాపల్లి జిల్లా చింతలపాలెంలో నిర్వహించిన సిద్ధం సభకు వార్ వన్‌సైడ్ అనే రీతిలో అనూహ్య స్పందన లభించింది. ముఖ్యంగా యువత, మహిళలు సీఎం వైఎస్ జగన్ మాటలకు కేరింతలు కొట్టారు. జగన్ వెంట మేమంటూ నినాదాలు చేశారు. ఈ ఎన్నికల్లో కూటమి కుయుక్తులు, చంద్రబాబు చెబుతున్న అబద్ధాల గురించి జగన్ చెప్పిన మాటలు ప్రజల్లోకి సూటిగా వెళ్లడంతో టీడీపీ, జనసేన పార్టీల వైఖరిపై ప్రజల్లో ఒక క్లారిటీ తీసుకొచ్చారు.

జనమంతా జేజేలు

అనకాపల్లి, విశాఖ జిల్లాలో బస్సుయాత్రకు వచ్చిన ఆదరణతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం రెట్టింపైంది. ఈసారీ జెండా రెపరెపలాడేలా జనమంతా జేజేలు పలుకుతుండటంతో.. అటు అభ్యర్థులు, పార్టీ శ్రేణులు దూకుడు పెంచారు. ఇంటింటా ప్రచారాన్ని మరింత ఉత్సాహంగా చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ విజయ ఢంకా మోగబోతోందన్నది స్పష్టమైంది.

ప్రతిపక్షాల్లో వణుకు: జనమంతా జగన్‌వైపే ఉన్నారన్న స్పష్టత రావడంతో ప్రతిపక్షాల్లో వణుకు మొదలైంది. వారంతా స్వచ్ఛందంగా జగన్‌ను చూసేందుకు వచ్చిన విషయం తెలుసుకొని టీడీపీ, జనసేన నేతలు కలవరపడుతున్నారు. ఫ్యాన్ గాలికి తట్టుకొని నిలబడటం కష్టమేనన్న సంకేతాలు కనిపించడంతో ఏం చేయాలో పాలుపోక ఆపసోపాలు పడుతున్నారు. గెలుపు అవకాశాలు కనుచూపు మేరలో కూడా కనిపించకపోవడంతో ప్రజలను ఎలా ప్రసన్నం చేసుకోవాలన్నదానిపై పునరాలోచనలో పడేలా బస్సుయాత్ర జైత్రయాత్రలా సాగింది. ఉమ్మడి విశాఖలో మేమంతా సిద్ధం బస్సుయాత్ర కనీవినీ ఎరుగని రీతిలో సూపర్ హిట్ అవ్వడంతో ఫ్యాన్ స్పీడ్ మరింత పెరిగింది. అధినేత పర్యటనతో అనకాపల్లి, విశాఖ జిల్లాలోని అభ్యర్థులు గెలుపుపై దీమా వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులకు బి ఫారంలు



ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా బీ ఫారంలు అందుకుంటున్న అభ్యర్థులు తనూజారాణి, మత్స్యలింగం

సాక్షి,పాడేరు: జిల్లాలోని అరకు ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ గుమ్మా తనూజారాణి, రేగం మత్స్యలింగం ఆదివారం విశాఖలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్,రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ పాల్గొన్నారు.

పాడేరు అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజుకు..




అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజుకు బీ-ఫారం అందజేస్తున్న పరిశీలకుడు శ్రీకాంత్‌రాజు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు పాడేరు నియోజకవర్గ పరిశీలకులు కె.శ్రీకాంత్‌రాజు బిఫారంను అందజేశారు.

ఓటర్ల అవగాహనకు క్రికెటర్ రవణి

- ఎంపిక చేసిన కలెక్టర్ విజయ సునీత



రవణిని అభినందిస్తున్న కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: జిల్లాలోని ఓటర్లకు అవగాహన కల్పించేందుకు గాను యూత్ ఐకాన్‌గా భారత అంధుల క్రికెట్ జట్టు ఆల్ రౌండర్ వలసనైని రవణిని కలెక్టర్ ఎం.విజయసునీత ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వీప్ కార్యక్రమంలో పాల్గొని ఓటు హక్కు వినియోగంపై చైతన్య పరచాలని కలెక్టర్ కోరారు.

కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ



అరకు అసెంబ్లీకి నామినేషన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం



నామినేషన్ అందజేస్తున్న రంపచోడవరం వైఎస్సార్ సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి

అరకు పార్లమెంట్‌కు ఐదు దాఖలు

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అరకు పార్లమెంట్తో పాటు మూడు అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. అరకు పార్లమెంట్ స్థానానికి సోమవారం పార్వతీపురం కలెక్టరేట్‌లో ఆర్వో నిషాంత్‌కుమార్ ఐదు నామినేషన్లను స్వీకరించారు. బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, స్వతంత్ర అభ్యర్థులుగా సమర్థి భవాని, వరం ఆవశ్య లహరి, కంగాల బాలుదొర, జేడీపీ అభ్యర్థిగా బిడ్డిక రామారావులు నామినేషన్లు సమర్పించారు.

పాడేరు అసెంబ్లీకి నాలుగు..

పాడేరు అసెంబ్లీ స్థానానికి నాలుగు నామినేషన్లను స్వీకరించినట్టు ఆర్వో భావన వశిష్ట తెలిపారు. బీఎస్పీ అభ్యర్థిగా సుర్ల అప్పారావు, కాంగ్రెస్ అభ్యర్థిగా సతక బుల్లిబాబు, స్వతంత్ర అభ్యర్థిగా వంతాల సుబ్బారావు, టీడీపీ తరపున గిడ్డి ఈశ్వరి నామినేషన్ల వేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తవయ్యాయి. ఆర్వో కార్యాలయాల వద్ద బందోబస్తున్న మరింత పటిష్టం చేశారు.

రంపచోడవరంలో నాలుగు నామినేషన్లు

రంపచోడవరం : రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి నాలుగోరోజు నాలుగు నామినేషన్లు అందినట్టు రిటర్నింగ్ అధికారి, సబ్‌కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా అడ్డతీగల మండలం రాజానగరం గ్రామానికి చెందిన నాగులపల్లి ధనలక్ష్మి రెండు నామినేషన్ పత్రాలను సమర్పించినట్టు ఆయన తెలిపారు. సీపీఐ తరపును రాజవొమ్మంగి మండలం కేశవరం గ్రామానికి చెందిన లోత రామారావు, రంపచోడవరం మండలం సిరిగిందలపాడు గ్రామానికి చెందిన పాలడుగు లక్ష్మీ ప్రసన్న రెండవసారి ఒక నామినేషన్ పత్రాన్ని సమర్పించారని ఆర్వో తెలిపారు.

అరకు అసెంబ్లీకి నాల్గో రోజు ఐదు..

పాడేరు : అరకు అసెంబ్లీకి సంబంధించి సోమ వారం నాల్గో రోజు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఐదు నామినేషన్లు స్వీకరించినట్టు ఆర్వో అభిషేక్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా రేగం మత్స్యలింగం రెండు సెట్లు, డమ్మీ అభ్యర్థిగా రేగం చాణక్య, బీఎస్పీ అభ్యర్థిగా లకే రాజారావు రెండో సెట్, స్వతంత్ర్య అభ్యర్థిగా మొగలి చంద్రకళ నామినేషన్లు అందజేసినట్టు రిటర్నింగ్ అధికారి అభిషేక్ తెలిపారు.

రంపచోడవరం.. జనసంద్రం

- నామినేషన్ సమర్పించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు
- మూడు కిలోమీటర్ల పొడవునా ర్యాలీ



రంపచోడవరం: పందిరిమామిడి సెంటర్ నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీ

రంపచోడవరం: రంపచోడవరం జనసంద్రాన్ని తలపించింది. సోమవారం స్థానిక ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి రంపచోడవరం అసెంబ్లీకి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ సమర్పించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని 11 మండలాల నుంచి పార్టీ క్యాడర్ తరలివచ్చింది. నామినేషన్ వేసేందుకు ఆమె ఎల్లవరం నుంచి ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు) ఆధ్వర్యంలో బయలుదేరారు. పందిరిమామిడి సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. జీసీసీ పెట్రోల్ బంక్ నుంచి పీఎంఆర్‌సీ వరకు జనంతో రోడ్డు కిక్కిరిసిపోయింది. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి, అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి ధనలక్ష్మి మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో ఎంతో ఆదరించారు. రాజకీయ చరిత్రలో ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ఇన్ని గిరిజన గ్రామాలను సందర్శించిన దాఖలాలు లేవు. మీ అభిమానంతోనే ఐదేళ్లకాలంలో ప్రతి గడపకు వెళ్లి ప్రతీ కుటుంబాన్ని పలకరించాను అన్నారు. ఎమ్మెల్యేగా కాకుండా మీ ఇంటి బిడ్డగా, మీ ఆడపడుచుగా ఆదరించారు. నా తదుపరి ప్రయాణం మీతోనే.. అంటూ మీ ఆడపడుచును ఆశీర్వాదించాలని కోరారు. వైఎస్సార్ సీపీని అధికారంలో తెచ్చుకుని సీఎం జగనన్న మరోసారి ముఖ్యమంత్రి చేద్దామన్నారు. వైఎస్సార్ సీపీ అరకు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి మాట్లాడుతూ ఇక్కడకు వచ్చిన జనాన్ని చూస్తుంటే విజయోత్సవ సభలా ఉందన్నారు.

మీ అందిరిలో ఒక భాగంగా కావడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. కొంతమంది మాత్రమే సేవ చేసిన తనకు ఎంపీ ఎంతో మందికి సేవ చేసే భాగ్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి, తను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆమె కోరారు. ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ రంపచోడవరం చరిత్రలో నామినేషన్‌కు ఇంతా మంది తరలివచ్చిన పరిస్థితి లేదన్నారు. ఎమ్మెల్యే ధనలక్ష్మికి మద్దతు తెలిపేందుకు వెంట వచ్చారని తెలిపారు. మన్యంలో వైఎస్సార్ సీపీని గిరిజనులు గుండెల్లో పెట్టుకున్నారు. పార్టీపై ఉన్న ఆదరణకు వచ్చిన జనమే సాక్ష్యమన్నారు. ఎంపీపీ, జడ్పిటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే ధనలక్ష్మి, వెంట ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్సీ అనంతబాబు



ఉత్సాహంగా పార్టీ కార్యకర్తలు

అట్టహాసంగా మత్స్యలింగం నామినేషన్

భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో నామినేషన్ వేసేందుకు వస్తున్న అరకు అభ్యర్థి రేగం మత్స్యలింగం

పాడేరు : వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం నామినేషన్ కార్యక్రమం సోమవారం అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గ కేంద్రమైన అరకువ్యాలీ నుంచి హుకుంపేట వరకు భారీ సంఖ్యలో కార్లు, ఆటోలు, తదితర వాహన శ్రేణితో ర్యాలీగా వచ్చారు. హుకుంపేటలో మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో అరకువ్యాలీ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచగిపుట్టు మండలాల నుంచి వేల సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. మండల కేంద్రం హుకుంపేట జంక్షన్ కిక్కిరిసిపోయింది. దారిపొడవునా గిరిజనులు, పార్టీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేశారు. వర్షం కారణంగా కొంతసేపు ఇబ్బందులు ఎదురయ్యాయి. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకురాలు శోభ హైమవతి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ ఆధ్వర్యంలో ఆయన నామినేషన్ అందజేశారు.

మోదమ్మ ఉత్సవాలకు పందిరి రాట

ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు: ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



సతకంపట్టు వద్ద పందిరిరాటను ప్రతిష్టించిన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: వచ్చే నెల 19, 20, 21 తేదీల్లో పాడేరు మోదకొండమ్మతల్లి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కమిటీ సభ్యులకు తెలిపారు. అమ్మవారి ఉత్సవాలకు సంబంధించి మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద పందిరిరాట ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీకి అన్ని వర్గాల భక్తులు సహకరించాలని కోరారు. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం, కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, వెంకటరమణ, శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు పూసర్ల గోపి, వెయ్యాకుల సత్యనారాయణ, శివరాత్రి శ్రీనివాసరావు, ముకుందరావు, అప్పలరాజు, ఉప్పల వెంకటరత్నం, దాసరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మన్యంలో భారీ వర్షం

- పాడేరు ఘాట్‌లో కూలిన చెట్టు
- స్తంభించిన జనజీవనం

సాక్షి, పాడేరు: మన్యంలో సోమవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వర్షం కురుస్తూనే ఉండడంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. నామినేషన్లు సమర్పించేందుకు వచ్చిన అభ్యర్థులు, వారి అనుచరులు ఇబ్బందులు పడ్డారు. జి.మాడుగుల, హుకుంపేట, చింతపల్లి, జీకే.వీధి మండలాల్లో వడగళ్ల వాన కురిసింది. పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడికి సమీపంలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలింది.ఇరువైపులా సుమారు గంట పాటు ట్రాఫిక్ నిలిచి పోయింది.ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందర బాబు సకాలంలో స్పందించారు. కూలిన చెట్టును సిబ్బందితో తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

నిఘా కట్టుదిట్టం

ముంచంగిపుట్టు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటుచేసి చెక్ పోస్ట్ వద్ద కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటుచేసినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. మండల కేంద్రమైన ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే ప్రధాన మార్గంలో దాసరిపుట్టు వద్ద చెక్ పోస్ట్‌లో సోమవారం వాహన తనిఖీలు ముమ్మరంగా చేశారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలు క్షుణ్ణంగా పరిశీలించారు. అపరిచితులు, అనుమానితుల వివరాలను సైతం సేకరించి విడిచి పెడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు, మద్యం, విలువైన వస్తువుల అక్రమ రవాణాపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్ఐ భూపతిపడాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి, జీడిమామిడి ఫలసాయానికి 25న వేలం

చింతూరు: ఐటీడీఏ పరిధిలోని కూనవరం మండలం పైడిగూడెం పండ్లతోటల ఉద్యానవనంలోని మామిడి, జీడిమామిడి ఫలసాయానికి ఈనెల 25న వేలం నిర్వహిస్తున్నట్టు పీవో కావూరి చైతన్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.అదే రోజు ఉదయం 10.30కు పైడిగూడెంలో వేలంపాట ఉంటుందన్నారు. పాల్గొనేవారు రూ.వెయ్యి ఈనెల 24లోగా డిపాజిట్‌గా చెల్లించాలని ఆయన సూచించారు,. వేలం ఖరారైన వారు వారు ముందుగా 25 శాతం చెల్లించాలని, మిగిలిన మొత్తానని వారంలోగా చెల్లించాలని పీవో తెలిపారు.

గ్రామాల్లో దాహార్తికి చెక్

- లక్షలాది రూపాయలతో తాగునీటి పథకాలు నిర్మాణం
- ఇంటింటికీ కుళాయి
- తీరిన తాగునీటి కష్టాలు
- ఆనందంలో గిరిజనులు



.తాగునీటి కోసం ఊటగెడ్డకు వెళుతున్న గిరిజన మహిళలు(నాడు)



గ్రామంలో కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు(నేడు)

జి.మాడుగుల: గిరిజన ప్రాంతాల్లో మహిళలు టీడీపీ ప్రభుత్వ హయాంలో బిందెడు నీళ్ల కోసం కిలోమీటర్లు కొలది కాలినడక వెళ్లి ఊటగెడ్డలు, పారుగెడ్డలను ఆశ్రయించే వారు. కలుషితమైన నీటితో అవసరాలు తీర్చుకొని రోగాల బారిన పడుతుండేవారు. దీంతో గిరిజనులు రోగాల మంచాన్న పడి పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. బావుల్లో, ఊటగెడ్డలో భూగర్భజలాలు ఇంకిపోయి గిరిజనులు తాగునీటి కోసం అల్లాడుతున్నా చంద్రబాబు ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మన్యంలోని ఏ గ్రామంలో ఒక్క వాటర్ ట్యాంకు నిర్మించిన దాఖలాలు లేవు. ఏళ్ల తరబడి తాగునీటి కోసం గిరిజనులు నానా అవస్థలు పడ్డారు. అదంతా గతం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన్య ప్రాంతాభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసింది. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించింది. ఏళ్ల తరబడి ఉన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించింది. గతంలో మాదిరిగా నీటి కోసం మండుటెండలో కిలోమీటర్లు దూరం వెళ్లాల్సిన దుస్థితికి చెక్ చెప్పింది. ఇంటింటికీ కుళాయి అందజేయడంతో గిరిజనులు జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే అండగా జీవితాంతం ఉంటామని చెబుతున్నారు.

కోట్ల రూపాయల నిధులు

జి.మాడుగుల మండలంలో విడతల వారీగా తాగునీటి పథకాలు, ఇంటింటికీ కుళాయి పనులు జరిగాయి. ఇందులో భాగంగా మొదటి విడుతలో 327 పనులకు రూ. రూ.10.56కోట్లు మంజూరు కాగా అన్ని పనులు పూర్తయ్యాయి. రెండో విడుతగా 194పనులకు రూ.13.60కోట్లు మంజూరు కాగా, ఇందులో 105 పనులు పూర్తికాగా, రూ.6.26కోట్లు చెల్లింపులయ్యాయి. మరో విడతగా రూ.3.60 కోట్లు మంజూరు కాగా ఆయా పనులకు టెండర్లు పూర్తి కావడంతో పనులు చేపట్టాల్సి ఉంది. మిగతా పనులు పురోగతిలో ఉన్నాయి. 234 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండటంతో 93 గ్రామాల్లో తాగునీటి పథకాలు నిర్మాణాలను జగనన్న ప్రభుత్వం చేపట్టింది. ఇంటింటికి తాగునీటి సదుపాయం కల్పించింది. మిగతా గ్రామాల్లో తాగునీటి పథకాలు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.మంచినీటి పథకాలు పూర్తిస్థాయిలో అందుబాటులోని రానున్నాయి. వేసవిలో ఏ గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పీవీటీజీ గ్రామాలు అన్నిటికీ తాగునీటి సౌకర్యం అందుబాటులోనికి వచ్చింది. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ క్రాస్ ప్రొగ్రామ్-2024టూర్ షెడ్యూల్ నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో బోర్లు మరమ్మతు పనులు చేపడుతారు.



సంగులోయలో రక్షిత మంచినీటి సరఫరా పథకం ట్యాంక్

ఆధునిక వ్యవసాయ విధానంతో మెరుగైన ఫలితాలు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంతి. చిత్రంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ నాయక్

మహారాణిపేట : అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ విధానాలను ఉపయోగించుకుని రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని ఆచార్య ఎన్.జి. రంగా విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు ఎల్. ప్రశాంతి అన్నారు. ఉత్తర కోస్తా మండల పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఉత్తర కోస్తా మండలంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అనకాపల్లితో పాటు నాలుగు వ్యవసాయ పరిశోధనా స్థానాలు, నాలుగు విస్తరణ కేంద్రాలు రైతులకు సేవలందిస్తున్నాయన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అనకాపల్లి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పి.వి.కె. జగన్నాథరావు ఉత్తర కోస్తా మండలంలో 2023- 24 సంవత్సరంలో జరిగిన పరిశోధన, విస్తరణ ప్రగతి గురించి వివరించారు. విస్తరణ సంచాలకులు కె.ఎస్.ఎస్. నాయక్ మాట్లాడుతూ ఏరువాక కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రాలు డ్రోన్ టెక్నాలజీ, మైక్రో ఇరిగేషన్ అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాయన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ప్రతినిధి బాలునాయక్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం అందజేసే సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయుక్తమన్నారు. ఈ కార్యక్రమం మంగళవారం కూడా కొనసాగుతుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సంచాలకులు డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఏ డైరెక్టర్ డాక్టర్ జో కిజకుడన్, ఉత్తర కోస్తా మండలంలోని వ్యవసాయ శాఖ డీఏవోలు, ఉద్యానవన శాఖ అధికారులు, నాబార్డ్ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, ఆత్మ అధికారులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మారిన వేళల్లో స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : ఇటీవల ప్రయాణికుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన విశాఖపట్నం - బెంగళూరు - విశాఖపట్నం మధ్య సమ్మర్ స్పెషల్ రైళ్ల వేళలు మారాయని, ప్రయాణికులు మార్పులు గమనించాలని వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం - ఎస్ఎంవీ బెంగళూరు (08549) ప్రతీ శనివారం విశాఖపట్నంలో మధ్యాహ్నం 1.15 గంటలకు బయల్దేరి, మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 29 వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీ బెంగళూరు - విశాఖపట్నం (08550) ప్రతీ ఆదివారం ఉదయం 8.50 గంటలకు బెంగళూరులో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 3.10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 30 వరకు నడుస్తుంది. ఈ రైళ్లు ఇరు మార్గాల్లో దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడ్, జోలార్‌పేట, కృష్ణరాజపురం స్టేషన్లలో ఆగుతాయి.

ఎంసీసీ మార్గదర్శకాలను పాటించాలి

పాడేరు : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్లు తప్పనిసరిగా ఎంసీసీ మార్గదర్శకాలను పాటించాలని ఎస్ఈబీ జిల్లా అధికారి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక డీఎస్ఈవో కార్యాలయంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎంఏ ఖదీర్‌తో కలిసి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్ఈబీ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. గైడ్ లైన్స్‌లో సూచించిన నిర్ణీత మొత్తం కంటే ఎక్కువ అమ్మకాలు జరిపితే సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్లపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జీఆర్వో సిబ్బందిని తరచుగా కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. రెండు శాఖలు సమన్వయం చేసుకొని పని చేయాలని, ప్రతి నెలా సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మన్యం నేతలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర , అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి, భర్త చెట్టి వినయ్

సాక్షి, పాడేరు: విశాఖలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఆదివారం రాత్రి జిల్లాలోని పలువురు నేతలు కలిశారు.జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఆమె భర్త డాక్టర్ తమర్బ నరసింగరావు,అ రకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజరాణి,ఆమె భర్త చెట్టి వినయ్,ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజులు వేర్వేరుగా కలిశారు.అరకు పార్లమెంట్‌తో పాటు జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ భారీ విజయంపై అధినేతకు వారు సమగ్రంగా వివరించారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లు

గూడెంకొత్తవీధి: మండలంలోని గ్రామ వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. గూడెం కొత్తవీధి సచివాలయం పరిధిలో -37 మంది, గూడెం సచివాలయం-2 పరిధిలో 20 మంది తమ రాజీనామా పత్రాలను అధికారులకు అందజేశారు. స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రచారం చేస్తామన్నారు.

వ్యాన్ బోల్తా పడి యువకుడి మృతి



బోల్తా పడిన వ్యాన్



పవన్‌కుమార్ మృతదేహం

మాడుగుల రూరల్: మండలంలోని కొండయ్యపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోతనపూడి గ్రామానికి చెందిన వద్దాది పవన్‌కుమార్(24) అనే యువకుడు మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ పి.దామోదర్‌నాయుడు కథనం ప్రకారం వివరాలు... పోతనపూడిలో గల ఎం.వరహాలుబాబు టెంట్ హౌస్‌లో పవన్‌కుమార్ పనిచేస్తున్నాడు. రావికమతం మండలం పొన్నవోలులో ఆదివారం జరిగిన వివాహానికి టెంట్ హౌస్ నుంచి జనరేటర్, ఇతర సామగ్రిని తీసుకెళ్లారు. అక్కడ కార్యక్రమం పూర్తయిన తర్వాత సోమవారం ఉదయం సామగ్రి, లైటింగ్, జనరేటర్‌ను బొలేరో వాహనంలో పొన్నవోలు నుంచి పోతనపూడి తీసుకొస్తుండగా కొండయ్యపాలెం వద్ద వ్యాన్ అదుపుతప్పి పక్కనున్న పంటపొలాల్లో బోల్తాపడింది. వాహనం వెనుక భాగంలో కూర్చున్న పవన్‌కుమార్ మీద వాహనం, వాహనంలోని ఉన్న జనరేటర్ పడ్డాయి. దీంతో తీవ్రంగా గాయపడిన ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. మృతదేహానికి అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

కశింకోట: మండలంలోని విసన్నపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ దుర్మరణం చెందాడు. సీఐ వినోద్‌బాబు అందించిన వివరాల ప్రకారం..యలమంచిలిలోని చిన్న గొల్లలపాలెంకు చెందిన ముప్పల సన్యాసినాయుడు (45) బయ్యవరం నుంచి విసన్నపేటకు బైక్‌పై వెళుతుండగా అదుపు కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సన్యాసినాయుడు ఎక్కడ పని ఉంటే అక్కడకు వెళ్లి కూలి చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎప్పటిలాగే కూలి పనికి వెళుతుండగా జరిగిన ప్రమాదంలోమృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు సీఐ తెలిపారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం



అన్నవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు



జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న పార్టీ శ్రేణులు

చింతపల్లిరూరల్: జగనన్న ప్రభుత్వానికి పట్టం కట్టండి అని వైఎస్సార్‌సీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు.మండలంలో అన్నవరం పంచాయతీ కేంద్రంలో వారపు సంతలో సోమవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్క దుకాణానికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకే ఓటేసి జగనన్నను మళ్లీ గెలిపించి ముఖ్యమంత్రి చెసుకుందామని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు అందించారన్నారు.గిరిజన ప్రాంతాభివృద్ధికి కోట్లాది రూపాయిలు మంజూరు చేయడం వలన గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్నాయన్నారు. జగనన్న చేసిన అభివృద్ధిని, మంచిని గుర్తు చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ కి లేని ప్రజాదరణ వైఎస్సార్‌సీపీకి ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణీ, ,పాడేరు అభ్యర్థి అయిన తనను (మత్స్యరాస విశ్వేశ్వరరాజు) గెలిపించాలని కోరారు. గిరిజన ప్రాంతం మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానన్నారు. ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, మండల పార్టీ అధ్యక్షులు మోరి రవి, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు,ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు, సర్పంచ్‌లు లోతా పండయ్య, సలీమితీ లక్ష్మయ్య, కోర్ర రమేష్ నాయుడు, కో-అప్షన్ సభ్యులు నాజర్‌వలీ, జేసీఎస్ కన్వీనర్ గణబాబు, ఎంపీటీసీలు జయలక్ష్మి, మీనాకుమారి, రూతు, మోహన్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణ, నాయకులు పరమేశ్వరరావు, సింహాచలం, రఘునాథ్, బెన్నిబాబు, గెమ్మిల సింహచలం, బాబూరావు, సుధాకర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరువీధి



కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. నాలుగోరోజు సోమవారం స్వామివారికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి విశేషంగా జరిగింది. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామితో పాటు శ్రీదేవి, భూదేవిలను అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని సూర్యప్రభ వాహనంపై తిలకించి పులకించి పోయారు. అర్చకులు రాజీవ్, శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 6.30 నుంచి పూర్ణాహుతి, చూర్ణోత్సవం, వసంతోత్సవం, గంగధార వద్ద చక్రస్నానం , రాత్రికి మృగయోత్సవం(దొంగలదోపు ఉత్సవం) నిర్వహించనున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు: మలేరియా జ్వరాల అదుపులో భాగంగా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వైద్యశాఖ అధికారులు, సిబ్బందితో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రతి ఇంట్లో తప్పనిసరిగా దోమలమందు పిచికారీ చేయాలని, ఈ కార్యక్రమానికి ఇతర శాఖల అధికారులు సహకారం అందించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీవో ఆదేశించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరాజు మాట్లాడుతూ దోమల మందు పిచికారీకి సంబంధించి వాడే విధానం, మెలకువలపై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. చింతూరు డివిజన్లోని 157 గ్రామాల్లో మొదటి విడతలో భాగంగా వచ్చేనెల 15 వరకు, రెండో విడత కింద జూలై నుంచి ఆగస్టు వరకు దోమలమందు పిచికారీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, నాలుగు మండలాలకు చెందిన వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ, ఎస్ఐ లోకేష్‌కుమార్

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ అన్నవరం, కన్నవరం, పోకలపాలెం, గోదుమలంక, బాలరేవుల గ్రామాల్లో సీఐ వెంకటరమణ, మంప ఎస్ఐ లోకేష్ కుమార్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు జరగకుండా చేసేందుకు మావోయిస్టులు ఎలాంటి విధ్వంసానికైనా పాల్పడే అవకాశం ఉందన్నారు. మావోయిస్టులకు ఎవరు సహకరించొద్దన్నారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు. గంజాయి రవాణా, సాగు, సారా తయారీ, విక్రయాలకు దూరంగా ఉండాలన్నారు. యువత ఉన్నత విద్యపై దృష్టి సారించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. యువత ఉపాధి కోసం ప్రభుత్వం స్కిల్ డవలప్‌మెంట్ ద్వారా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

యజమానిని ఏమార్చి.. బంగారు నగల చోరీ

ఆభరణాలతో ఉడాయించిన గుర్తుతెలియని ముగ్గురు మహిళలు



సీసీ టీవీలో రికార్డు అయిన మహిళల చోరీ వ్యవహారం

చింతూరు: గుర్తు తెలియని ముగ్గురు మహిళలు సినీఫక్కీలో బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన చింతూరులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వీరు బంగారు ఆభరణాల కొనుగోలు కోసమంటూ స్థానిక మెయిన్‌రోడ్‌లో నీలిమా జ్యూయలర్స్ షాపునకు వచ్చారు. అక్కడ బంగారు ఆభరణాలు చూస్తున్నట్లుగా నటిస్తూ రెండు జతల చెవిదిద్దులు చాకచక్యంగా కాజేశారు. అనంతరం చోరీ చేసిన ఆభరణాల స్థానంలో షాపు యజమానికి అనుమానం రాకుండా చిన్నసైజులో నకిలీ ఆభరణాలు ఉంచి ఏమీ కొనకుండా అక్కడి నుంచి ఉడాయించారు. వారు వెళ్లిన పిదప షాపు యజమానికి అనుమానం వచ్చి నకిలీ ఆభరణాలు పరిశీలించగా రూ.50 వేల విలువచేసే రెండు జతల చెవిదిద్దులు మాయమైనట్లు గుర్తించారు. అనంతరం షాపులో సీసీటీవీ పుటేజ్‌ను పరిశీలించగా ముగ్గురు మహిళలు చోరీ చేసిన వైనం బయటపడింది. ఈ ఘటనపై షాపు యజమాని సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

అక్రమ మద్యంపై గట్టి నిఘా పెట్టండి



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న బి.విజయభాస్కర్

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలో అక్రమ మద్యం పంపిణీ నిర్మూలనకు దిగువస్థాయి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎడిషనల్ ఎస్పీ, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, జిల్లా స్థాయి అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎక్కడికక్కడ మద్యం పంపిణీని అరికట్టడానికి అధికారులతో పాటు దిగువస్థాయి సిబ్బంది తనిఖీలను నిర్వహించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులపై దృష్టి సారించాలని, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే మద్యంపై నిఘా పెట్టాలని సూచించారు. అలాగే మద్యం డిపో నుంచి ప్రభుత్వ బార్‌లకు సరఫరా అయ్యే మద్యం నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు.